# హవా మహల్

"ఏటి అరునాసెలం! యీపొద్దింత బేగొచ్చేసినావు!?" అన్నాడు ఆరుముగం తను కూడా అరుణాచలం పక్కనే కూర్చుంటూ.

"ఏటుంది! ఆరుముగం! యండ మండిపోతుంది. అయిదు గంటలైనా యండ సురుకుమంటుంది. గాల్నేదు! అంచాత యాడున్నావోటే" అన్నాడు.

అరుణాచలం, ఆరుముగం స్నేహితులు. ఆర్నెలల క్రితం ఒకరి మొహం ఒకరికి తెలీదు. ఆ వూర్లో జరిగిన ఓ పెళ్ళి దగ్గర యిద్దరూ కల్సుకున్నారు. మర్నాడు సాయంత్రం మహాత్మాపార్కు దగ్గర మళ్ళీ కల్సుకున్నారు. ఆనాటి నుండీ రోజూ సాయంత్రం ఐదు గంటలకు మహాత్మాపార్కు దగ్గరకు ఆరుముగం తన ఎనిమిదేళ్ళ కూతురు మల్లితోను, అరుణాచలం, తన పదేళ్ళకొడుకు రంగడుతోను వచ్చి కల్సుకుంటున్నారు.

మహాత్మా పార్కుకి ఆ వూర్లో గొప్ప ప్రాముఖ్యతుంది. బహిరంగసభలూ సమావేశాలు తరుచు అక్కడే జరుగుతుంటాయి. దాని పక్కనే మరో రెండు పెద్ద పార్కులు, ఓ పిల్లల పార్కు వున్నాయి.

అటుపక్క మూడు సినిమా హాళ్లున్నాయి. దగ్గర్లో రెండు పెద్ద మైదానాలున్నాయి. వాటిలో సర్కసులూ ఎగ్జిబిషన్లూ జరుగుతుంటాయి.

ఫర్లాంగు దూరంలో బస్సు స్టాండుంది. అర ఫర్లాంగులో గంటస్తంభం, పావు ఫర్లాంగులో పెద్ద బజారుంది. ఓ విధంగా ఆ ప్రదేశం ఆ వూరికి నైట్ ఎయిర్ సర్వీస్‌కి నాగపూర్ జంక్షన్ లాటిది. సాయంత్రమయేసరికి ఆ ప్రదేశం జనంతో టకిటకి, కిట కిట లాడుతుంది.

ఎటువంటి వారికైనా కాలక్షేపానికి అనువైన ప్రదేశం.

"....రేయ్ రంగా! దెబ్బల్దగల్సుకోకుండా ఆడుకోండి" అంటూ కేకేసేడు

అరుణాచలం.

రంగడు మల్లి చేయి పట్టుకొని పిల్లల పార్కు వేపు పరిగెత్తేడు.

"సూడు అరునాసెలం! నామాటిని మీవోడ్ని డాకటేరు సదియించు! మా అల్లుడు డాకటేరు కావోల!" అన్నాడు ఆరుముగం. "ఏట్నాబం? వూర్ల యీది కిద్దరున్నారు. అంచాత వింజనీరు సదియిత్తే బావున్ను ఏటంటావు?"

"లగ్గవప్పుడు పైసా కట్టం అడగను అదేదో నువ్వే సూడ కూడదు" అన్నాడు అరుణాచలం నవ్వుతూ.

"రేతిరి మావోడితో వూసులాడుతూ మల్లిని మనువాడుతావేటన్నా! ఆడేటన్నాడను కున్నావ్!?

"నాకబ్బెంతరవేటేన్లేదు? లచ్చిమీ వోటేలు నాకొగ్గేమను అన్డు!"

"ఏటేటి? లచ్చిమీ వోటేలే!?" అంటూ ఆశ్చర్యపోయేడు ఆరుముగం.

అవును మరి ఆశ్చర్యపోడూ? లక్ష్మి హొటలుకున్న పేరు రాబడి వూర్లో మరే హొటల్‌కి లేదు. అందుక్కారణం రైలు దిగి వూర్లోకొచ్చే జనం లక్ష్మి హొటల్ మీదుగానే రావాలి. స్టేటు బ్యాంకు, దాని ఎదురుగా పెద్దాసుపత్రి, దాని పక్కనే పెద్ద పోస్టాఫీసూ వీటన్నిటికీ ఎదర లక్ష్మి హొటల్. అంతే కాకుండా అర ఫర్లాంగులో ఎడా పెడా మూడు సినిమాహాళ్ళు. మరి లక్ష్మి హొటల్‌కున్న గిరాకీ మరే హొటల్ కుంటుంది?

"మూడోరాలయి యీకొత్తాల్లో బొమ్మ పిరాయించనేదేటి? పెజలు ఏటో అలా యిరగబడి సూస్తున్నారు."

"సోసలవుతే వోరం దిరగదు. మరిది పైటింగు పిచ్చరు గందా! కబ్బ డేనుసులు ఎట్నారంటే ఏడాది లాగుద్ది"

"అట్టాటి బొమ్మ దియ్యాలనుందేస్!"

"ఒరోరి ఆటిజోలెల్లమోక! ఎర్రిమొకమా! మసై పోతవు!"

"ఎవుడో వొత్తన్నాడు!" అన్నాడు అరుణాచలం.

ఆరుముగం ఎదురెండకు మోచేయి అడ్డంపెట్టి రోడ్డువైపు చూసేడు.

"ఆడా సీసి! పిసినారి నా కొడుకు. మిటాయి పొటలం ఆకులు కూడా నాకందీ పారీడు"

ఆ వస్తున్న వ్యక్తిని వారు ఆర్నెల్ల నుంచీ ఎరుగుదురు. అతను రోజూ సాయంత్రం పార్కుకి వస్తున్నప్పుడు గంట స్తంభం వద్ద మిఠాయి పొట్లం కొని తెచ్చుకుని పార్కులో కూర్చుని పొట్లం విప్పి, తిని, కట్టే ముందు ఆకులు ఎంత పరిశుభ్రంగా ఉన్నాయో, పారేసేటప్పుడు కూడా అంత సాపుగా చేసి పారేస్తాడు.

ఆరుముగానికి మనుషుల సైకాలజీ బాగా తెల్సు. మనిషిని చూడగానే వాడి నైజం చిటికెలో చెప్పేయగల్డు. అరుణాచలం కూడ మిత్రుడి సహవాసంతో ఈమధ్య మనుషుల్ని స్టడీ చెయ్యడం నేర్చుకుంటున్నాడు.

యింతలో ఓ యువకుడు ట్రిమ్ముగా తయారై విలాసంగా సిగరెట్ కాలుస్తూ

అమ్మాయిల వెంట వస్తున్నాడు.

"దరమ పెబువులు! సినబాబూ! అవిటోల్లం దరమం సెయ్యండి" అంటూ ఆరుముగం, అరుణాచలం గొంతెత్తి దీనంగా అరిచేరు, కుష్ఠురోగంతో మొండి తేరిన తమ చేతులు పైకెత్తి.

ఆ యువకుడు అణా బిళ్ల తీసి వాళ్ల ముందు విసిరేడు. అది వారిద్దరి ముందు పడి రోడ్డు మీదకు దొర్లింది.

"ఆ బాబు నాకేసి చూసి యేసినాడంటే నాకేసి యేసినాడని" యిద్దరూ రోడ్డు మధ్య తగువుకు దిగేరు. అరుణాచలం భూమ్మీదున్న అణా బిళ్ల చేత్తో నొక్కి వుంచేడు. ఆ చెయ్యి మీద తన పాదం నొక్కి వుంచేడు ఆరుముగం.

ఎదురుగా ఫర్మని ఫుల్‌స్పీడ్‌లో కొట్టుకొస్తూంది ఓ ఎమ్టీ లారీ. ఆ లారీ నుదురు మీద 'డెమొక్రటిక్ లారీ సర్వీస్' అని రాసి వుంది. లారీ పక్కలంట ఆలిండియా పెర్మిట్ అని ఓ పక్క, రెండో పక్క హరే రామ హరే రామ క్రిష్ణ క్రిష్ణ హరే హరే' అని రాసుంది.

లారీవాడు హారన్ కొడుతూనే వున్నాడు. కాని ఆ గాంధీ పార్కులో ఏ హారన్ ఏ బస్సుదో ఏ లారీదో ఎవరికీ తెలీదు. అంటే ఆ ఏరియాలో మోటారు మోతలకి విరామం వుండదు.... క్రేష్....!

అరుణాచలం, ఆరుముగం ముష్టి అణా కోసం ప్రాణాలను అంకితం చేసేరు. అణా బిళ్ల మాత్రం చూస్కో నా తడాఖా అంటూ రోడ్డు మీద తళతళ మెరుస్తూంది. దాన్ని ఎత్తిన వాళ్ళను అది ఎత్తుతుందిట.

*'కథాంజలి' జూలై 1952*